క్లుప్తంగా

సారా వ్యాపారులపై బైండోవర్ కేసు నమోదు



సారా వ్యాపారాలు చేయమని ప్రమాణం చేయిస్తున్న సీఐ జీడీ బాబు

సాలూరు: సారా వ్యాపారస్తులు 34 మందిపై తహసీల్దార్ బాలమురళీకృష్ణ ద్వారా పట్టణ సీఐ జీడీ బాబు బైండోవర్ కేసులు నమోదు చేయించారు. అనంతరం తన కార్యాలయానికి వారిని పిలిపించి సారా వ్యాపారం ఇకపై చేయమని ప్రమాణం చేయించారు. సారా విక్రయాల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.

ఫైలేరియా నివారణకు ప్రత్యేకడ్రైవ్

సీతానగరం: ఫైలేరియా నివారణకు రక్త నమూనాలు సేకరించడానికి ఆదివారం రాత్రి సీతానగరం మండలంలోని అన్నిగ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ పావని ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని సీహెచ్ఓ ఎన్వీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ బోదకాలు వ్యాధికి కారణమైన దోమలు రాత్రి పూట కుడతాయని అవి కుట్టే సమయంలో హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించారని తెలియజేశారు. అలాగే దోమల నివారణకు ఇప్పటికే ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాత్రిపూట గ్రామాలకు వస్తున్న వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

దోకిశీల పీహెచ్‌సీ పరిశీలన



మలేరియా జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎంఓ

పార్వతీపురం టౌన్: దోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డులను తనిఖీ చేసి నమోదు చేసిన అనారోగ్య సమస్యలు, చికిత్సల వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వరంతో ఆస్పత్రికి ఎవరు వచ్చినా, జ్వర లక్షణాలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసి ఫలితాలు నమోదు చేసి తగు చికిత్స అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం. కౌశిక్, ఏఎంఓ సూర్యనారాయణ, సూపర్‌వైజర్‌లు శ్రీనివాసరావు, కృష్ణంరాజు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత పాచిపెంట



పాచిపెంట పురుషుల క్రికెట్ జట్టు

పాచిపెంట: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలుగా పాచిపెంట బాలుర, బాలికల జట్లు నిలిచాయి. మండలంలోని పి.కోనవలస క్రీడా మైదానంలో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో పాచిపెంట బాలురు జట్టు సాలూరుపైనా.. పాచిపెంట మహిళల జట్టు మెంటాడపై గెలిచాయి. ఈ సందర్భంగా విజేతలను నిర్వాహకులు అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బీఎంఆర్ థియేటర్ లైసెన్స్, ఇతర పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ప్రభుత్వ నిబంధనల మేరకు టికెట్లు విక్రయించాలే తప్ప ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచి రోజుల తరబడి విక్రయిస్తామంటే చర్యలు తప్పవని తహసీల్దార్ చందక సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని బీఎంఆర్ సినిమా హాల్‌లో టికెట్ రేట్లు అధికంగా ఉన్నాయని, థియేటర్‌లో కూల్‌డ్రింక్స్, ఇతర తినుబండారాల ధరలు బయట మార్కెట్ ధరకంటే ఎక్కువగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో సోమవారం థియేటర్ సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. థియేటర్ లైసెన్స్, టికెట్ రేట్లు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. థియేటర్‌లో ఎన్ని తరగతులు ఉన్నాయి. వాటి టికెట్ ధరలు ఎంత అని థియేటర్ మేనేజర్ సూర్యనారాయణను అడగగా.. అన్ని క్లాసుల టికెట్ ధరలు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీంతో తహసీల్దార్ ఆయనపై మండిపడ్డారు. మీ ఇష్టం వచ్చినట్లు టికెట్ ధరలు నిర్ణయించి అమ్మితే కుదరదని, వెంటనే క్లాసుల వారీగా టికెట్ ధరల పట్టిక, పార్కింగ్ రేట్ల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే థియేటర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆర్థికంగా ఎదగాలి..



మహిళలకు చెక్కు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మహిళలకు అండగా జగనన్న
- ప్రజలకు మేలు చేయడమే జగన్ మోహన్ రెడ్డి అజెండా
- మోసం చేసి దోచుకోవడమే చంద్రబాబు సిద్ధాంతం
- ఆసరా సభలో డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర పదునైన ప్రసంగం.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాటలకు మహిళల నృత్యాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం దద్దరిల్లిపోయింది. సోమవారం సాయంత్రం నిర్వహించిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సభకు లబ్ధిదారులు వేలాది మంది హాజరుకాగా.. మంత్రి రాజన్నదొర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ ఓ పెద్దకొడుకులా వ్యవహరిస్తూ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలను మహిళలకు అందజేస్తూ, వారి ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి డ్వాక్రా, రైతు రుణమాఫీ, తదితర హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగితే తప్ప పింఛన్ మంజూరయ్యేది కాదని.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో మాత్రం రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ అని పవన్ కల్యాణ్‌తో కలిసి వస్తున్న టీడీపీ నాయకులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన భంజ్‌దేవ్, ఆరు సంవత్సరాలు ఎమ్మెల్సీగా పనిచేసిన సంధ్యారాణి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రమ్మని పలుమార్లు సవాల్ విసిరినా ఎవ్వరూ స్పందించలేదన్నారు. ప్రజలకు మంచి చేయడం జగనన్న అజెండా కాగా ప్రజలను మోసం చేయడమే టీడీపీ అజెండా అని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆసరా లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ క్రమంలో పార్టీ గీతాలకు నృత్యం చేస్తూ జై జగన్.. జై రాజన్నదొర అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు టౌన్ పరిధిలోని 926 సంఘాల్లోని మహిళలకు 31,45,65,000 రూపాయల చెక్కు, రూరల్ పరిధిలోని 975 సంఘాలకు 4,58,000,00 రూపాయల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఎంపీపీ జి.రాములమ్మ, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, మెప్మా పీడీ సుధాకరరావు, మున్సిపల్ కమిషనర్ జయరామ్, ఎంపీడీఓ పార్వతి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, సచివాలయ మండల కన్వీనర్లు క్లోపల్లి త్రినాథ, గిరి రఘు, ప్రజాప్రతినిధులు, నాయకులు జర్జాపు సూరిబాబు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన జనసందోహంలో ఓ భాగం

మహిళా సంఘాలకు ఆర్థిక ఆసరా



నమూనా చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- రూ.5.97 కోట్ల చెక్కు అందజేత

పార్వతీపురంటౌన్: అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా చేయూతనిచ్చి వారిని లక్షాధికారులను చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘానికి సంబంధించి పార్వతీపురం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆసరా సంబరాల్లో ఆయన సోమవారం పాల్గొని లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, రుణమాఫీ, ఇళ్ల పట్టాలు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనతోపాటు పలు సంక్షేమ పథకాలు మహిళల పేరిన అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు.

మాట నిలబెట్టుకున్న జగన్

కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రసంగిస్తూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్వయం సహాయ సంఘాల గ్రూపు సభ్యులకు పావలా వడ్డీ అందిస్తే, నేడు ముఖ్యమంత్రి జగనన్న ఆసరా పథకం ద్వారా పూర్తి రుణమాఫీ చేశారన్నారు. చంద్రబాబు రుణ మాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారని, సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని నాలుగు విడతల్లో రుణమాఫీ చేసినట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మహిళలందరూ సీఎం జగన్‌ను ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

మహిళలే వైఎస్సార్‌సీపీకి అండ

గత ఎన్నికల్లో రాజన్న రాజ్యం స్థాపనకు అన్నివర్గాల ప్రజలతోపాటు ప్రధానంగా మహిళలు తమకు అండగా నిలిచారన్నారు. మళ్లీ జగనన్నను సీఎంను చేసేందుకు మీరే మా బలమని, మీరంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చేదోడుగా నిలవాలని కోరారు.

రూ.5.97 కోట్ల చెక్కు అందజేత

పట్టణంలోని 833 సంఘాల్లో గల 8357 మందికి రూ. 5.97 కోట్ల చెక్కును ఎమ్మెల్యే జోగారావు పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, వార్డు కౌన్సిలర్‌లు, మెప్మా సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాల లబ్ధి ఇలా..

విడత	మహిళా సంఘాలు	సభ్యులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి	833	8357	రూ. 5.97
రెండవ	833	8357	రూ.5.97
మూడవ	833	8357	రూ. 5.97
నాల్గవ	833	8357	రూ. 5.97

ఆసరాతో ఎంతో లబ్ధి



ఇంటి ఖర్చులకు సైతం ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఆసరా డబ్బులు నాలుగు విడతలు కలిపి సుమారు రూ.1.50 లక్షలు మా సంఘానికి వచ్చాయి. ఇటు కుటుంబ పోషణ భారం తప్పింది. అటు నాకు ఒక పని దొరికింది. మాకు ఇంతకంటే ఏంకావాలి. జగనన్నకు మేం రుణపడి ఉంటాం.

– కె. మంగ, లబ్ధిదారు, పార్వతీపురం పట్టణం

ప్రశాంత జీవనం



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా దక్కడంతో ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో తిరిగి రూ.50 వేలు చెల్లించినందుకు చాలా ఆనందంగా ఉంది. బ్యాంకులు ఎక్కువగా రుణాలు అందిస్తున్నాయి. వాటితో వ్యాపారం సజావుగా జరుగుతోంది.

– వి.కల్యాణి, లబ్ధిదారు, పార్వతీపురం పట్టణం

క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: క్రీడలతోనే శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని, యువత ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించడంలో పాటు తమ భవిష్యత్తు నిర్దేశించుకోవడంలో క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో భాగంగా పురుషుల క్రికెట్‌లో నియోజకవర్గం స్థాయిలో మొదటి బహుమతి గెలిచిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, 25వ వార్డు కౌన్సిలర్ ఎస్.సుధీర్, వార్డు కౌన్సిలర్‌లు, తదితరులు పాల్గొన్నారు.


సమన్వయంతో పనిచేయాలి



ప్రజాప్రతినిధులకు ప్రగతి వివరాలు వెల్లడిస్తున్న ఏపీఓ ఈశ్వరమ్మ

మక్కువ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండలాన్ని అభివృద్ధి చేసుకోగలమని ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించి ప్రగతి వివరాలు వెల్లడించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది చక్కగా నిర్వహించాలన్నారు. వచ్చేనెల 3న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం మండలంలో ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజల తాగునీటి ఇబ్బందిని తీర్చేందుకు ప్రభుత్వం ఇంటింటికీ కుళాయిలు వేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో డీటీ షేక్ ఇబ్రహీం, వైస్ ఎంపీపీ చప్ప అన్నపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య నందించాలి



జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యాలయంలో విద్యాబోధన పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు భోజనవసతి, నాణ్యమైన విద్యనందించడానికి చర్యలు చేపట్టాలని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఈశ్వరరావును ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన జోగిం పేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వచ్చే టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణం సాధించడానికి విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతులు నిర్వహించడం శుభపరిణామమన్నారు. విద్యాపరంగా వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించి విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- సీఐడీ డీఎస్పీ డి.లక్ష్మణరావు

కొమరాడ: గిరిజనులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని విశాఖపట్నం రీజనల్ సీఐడీ కార్యాలయం డిప్యూటీ సూపరింటెండెంట్ డి.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ) కార్యాలయంలో గిరిజన హక్కులు, సాధికారితపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని లాభపొందాలని సూచించారు. గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు రూపొందించిందన్నారు. వాటిపై గిరిజనులు అవగాహన పెంచుకోవడం ద్వారా వారి హక్కులను కాపాడుకోవచ్చన్నారు. తహసీల్దార్ ఎం .భుజంగరావు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, పూడేస్ మాజీ సర్పంచ్ చోడి ఆనంద్ తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

మక్కువ: మండలంలోని డి.శిర్లాం గ్రామంలో గోముఖి, సువర్ణముఖి నదుల కలయిక వద్ద ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీతానగరం మండలం కొత్తవలస జైజంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. నదినుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా, పోలీసులు వచ్చినట్లు ట్రాక్టర్ డ్రైవర్‌కు తెలియడంతో వేగంగా వెళ్లడంతో అదుపు తప్పి బోల్తాకొట్టినట్లు అంతా భావిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. బోల్తా పడిన ట్రాక్టర్‌ను రాజకీయనాయకుల అండతో, గుట్టుచప్పుడు లేకుండా తరలించినట్లు సమాచారం.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి



ఎల్ఈడీ లైట్లు అందజేస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. ఎంపీ నిధులతో మంజూరు చేసిన ఎల్ఈడీ లైట్లను సోమవారం మండల పరిషత్ వద్ద వివిధ గ్రామాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 25 పంచాయతీలకు ఎల్ఈడీ లైట్లు అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే ప్రజలకు అవసరమైన తాగునీరు, వీధిలైట్లు, కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, నాయకులు బి.చంద్రశేఖరరావు, పి.సత్యనారాయణ, సిబ్బంది జి.ప్రసాద్, శ్రీకాంత్ ఉన్నారు.

జగనన్న కాలనీ ఇళ్లస్థలాలకు రిజిస్ట్రేషన్లు



పెదంకలాంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న కాలనీల్లో పేదలకు పంపిణీ చేసిన ఇళ్లస్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని వీఆర్వోలు, డిజిటల్ సహాయకులను తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి, లక్ష్మీపురం, బూర్జ, పెదంకలాం సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పెదంకలాం సచివాలయంలో మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని సమకూర్చి స్థలాలు ఇవ్వడం, అదేస్థలంలో ఇంటినిర్మాణం నిమిత్తం ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచనల మేరకు ప్రభుత్వం సమకూర్చిన స్థలం లబ్ధిదారుని పేరున శనివారం నుంచి సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేయడం ప్రారంభించామని తెలియజేశారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలకు చెందిన జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలను లబ్ధిరుల పేరిట సచివాలయాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు రిజిస్ట్రేషన్లు చేస్తారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన సదవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల వీఆర్వోలు, కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యం



సాయంత్రం నిర్వహిస్తున్న తరగతుల్లో విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యమని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు సబ్జెక్టు వారీగా ఉదయం–సాయంత్రం నిర్వహిస్తున్న అదనపు తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో నిర్వహించిన అదనపు తరగతులను ఆమె పరిశీలించారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచనల మేరకు విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగానే ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. మండలంలో 902 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, వాటిని రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు పత్రాలు అందివ్వాలని సిబ్బందికి సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.కుమారస్వామి, ఆర్ఐ లక్ష్మనాయుడు, వీఆర్వో బాసూరు శ్రీనివాసరావు, తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



సీఆర్పీలకు సూచనలు చేస్తున్న ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహించే అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా ఆయా పాఠశాలల హెచ్ఎంలు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను సోమవారం వారు సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. విద్యుత్, ర్యాంపులు, బాత్‌రూంలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని, పాఠశాలలకు విడుదలైన ఎస్ఎంఎఫ్ ఫండ్‌ను పాఠశాల అవసరాల కోసమే వినియోగించాలని సూచించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు వాల్యూషన్ చేసి ఓఎంఆర్ సీట్‌లలో వివరాలు ఎంటర్ చేసి వాటిని ఎంఈఓ కార్యాలయానికి అందజేసేలా చూడాల్సిన బాధ్యత సీఆర్పీలదే అని అన్నారు. సంబంధిత సీఆర్పీలు వాటిని తీసుకొని భద్రపరచాలని సూచించారు.